# భారత న్యాయవ్యవస్థ (సుప్రీంకోర్ట్ - హైకోర్ట్)

ప్రభుత్వ అంగాలైన శాసనశాఖ, కార్యనిర్వాహక శాఖ, న్యాయ శాఖలలో మూడవ అంగమైన న్యాయశాఖ అత్యంత ముఖ్యమైంది. ప్రజల హక్కుల పరిరక్షణ, రాజ్యాంగ ఆధిక్యతను కాపాడడంలో కీలకపాత్ర వహిస్తుంది. న్యాయశాఖ కంటే ప్రజాస్వామ్యానికి మరో గీటురాయి లేదని ''లార్డ్‌బ్రైస్'' అనే రాజనీతి విశ్లేషకుడు వ్యాఖ్యానించాడు.

## భారత న్యాయవ్యవస్థ – లక్షణాలు

భారతదేశంలో ఏకీకృత, సమగ్ర, స్వతంత్ర, నిష్పక్షపాత, సర్వోన్నత న్యాయవ్యవస్థ ఉంది. సాధారణంగా సమాఖ్య వ్యవస్థలో ద్వంద్వ న్యాయవ్యవస్థ ఉంటుంది. అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ చట్టాలకు వేరువేరుగా ప్రత్యేక న్యాయస్థానాలుంటాయి. కాని భారతదేశంలో న్యాయశాఖ విభజన లేదు. కేంద్ర, రాష్ట్ర చట్టాలకు ప్రత్యేక కోర్టులు లేవు. దేశంలో న్యాయస్థానాలన్ని సుప్రీంకోర్ట్ పర్యవేక్షణలో పని చేస్తాయి.

## సుప్రీంకోర్టు – నిర్మాణం,అధికారం, విధులు

దేశంలో అత్యున్నత న్యాయస్థానాన్ని, ''సుప్రీంకోర్ట్'' అంటారు. 1773 రెగ్యులేటింగ్ చట్టం ద్వారా 1774లో మొట్టమొదటసారిగా కలకత్తాలోని ''పోర్ట్‌విలియమ్స్''లో సుప్రీంకోర్ట్‌ను స్థాపించారు. ఆ తరువాత భారత ప్రభుత్వ చట్టం 1935 ప్రకారం ఫెడరల్ కోర్టును ఏర్పాటు చేశారు. 1950 జనవరి 28వ తేదీన ''ఫెడరల్ కోర్టు''ను ''సుప్రీంకోర్టు''గా పేరు మార్చి కొనసాగించారు.

### నిర్మాణం :

భారత రాజ్యాంగంలో ఐదవ భాగం, ప్రకరణలు 124 నుంచి 147 వరకు సుప్రీంకోర్ట్ నిర్మాణం అధికార విధుల గురించి సమగ్రంగా ప్రస్తావించారు.

ప్రకరణ 124 ప్రకారం సుప్రీంకోర్టులో ఒక ప్రధాన న్యాయమూర్తి, పార్లమెంట్ నిర్ణయించిన సంఖ్యలో ఇతర న్యాయమూర్తులు ఉంటారు. 2009 ఫిబ్రవరిలో సుప్రీంకోర్ట్ జడ్జీల సంఖ్యను పెంచడం జరిగింది. ప్రస్తుతం ఒక ప్రధాన న్యాయమూర్తి, 30 ఇతర సాధారణ న్యాయమూర్తులు ఉంటారు.

సుప్రీంకోర్ట్ ప్రారంభంలో ఒక ప్రధాన న్యాయమూర్తి, ఏడుగురు న్యాయమూర్తులు ఉండేవారు.

- 1956లో దీనిని 11కు
- 1960లో 14కు
- 1977లో 18కి
- 1986లో 26కు పెంచారు.
- 2008లో 31కి పెంచుతూ చట్టం చేశారు. ఈ సవరణ 2009 ఫిబ్రవరి నుంచి అమలులోకి వచ్చింది.

## న్యాయమూర్తుల నియామకం :

ప్రకరణ 124 (2) ప్రకారం సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తిని ఇతర న్యాయమూర్తులను రాష్ట్రపతి నియమిస్తారు. ఇతర న్యాయమూర్తులను నియమించే సందర్భంలో రాష్ట్రపతి, సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టులోని నలుగురు ఇతర సీనియర్ న్యాయమూర్తులను సంప్రదిస్తారు.

## జడ్జీల నియామకం – వివాదం – కొల్లీజియం :

సుప్రీంకోర్ట్ జడ్జీల నియామక విషయంలో రాష్ట్రపతి ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించాలి అనే అంశంపై సుప్రీంకోర్ట్ విభిన్న అభిప్రాయాలను వ్యక్తీకరించింది. ఫస్ట్ జడ్జికేస్ 1983 ప్రకారం సంప్రదించడం అంటే సాధారణంగా అభిప్రాయం తెలుసుకోవడమే, వాటిని పరిగణనలోకి తీసుకోవచ్చు, తీసుకోకపోవచ్చు. అయితే రెండవ జడ్జి కేసు 1993లో సంప్రదించు అంటే సమ్మతి అనే అర్థాన్ని చెప్పింది. అలాగే 1998లో 3వ జడ్జి కేసులో సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి సలహాతో పాటు నలుగురు సీనియర్ న్యాయమూర్తులను కూడా సంప్రదించాలని (కొలీజయం) పేర్కొంది. ఈ నలుగురు జడ్జీలలో ఇద్దరు భిన్నాభిప్రాయాలు వ్యక్తీకరిస్తే కొలీజియం సలహాను రాష్ట్రపతికి పంపాల్సిన అవసరం లేదు.

## ప్రధాన న్యాయమూర్తి నియామకం

రాజ్యాంగంలో సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తికి ప్రత్యేక అర్హతలను పేర్కొనలేదు. సాధారణంగా సీనియర్ న్యాయమూర్తిని నియమిస్తారు. 1950 నుంచి 1973 వరకు ఇదే నియమాన్ని పాటించారు. కాని 1973లో కేశవానంద భారతి కేసు తర్వాత ముగ్గురు సీనియర్ న్యాయమూరులను కాదని జూనియర్ అయిన ఎ.ఎన్.రేను కూడా ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. అలాగే 1977లో కూడా సీనియర్ న్యాయమూర్తి అయిన హెచ్.ఆర్.ఖన్నాను కాదని జూనియర్ అయిన ఎం.హెచ్.బేగ్‌ను ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు.

## అర్హతలు :

ప్రకరణ 124 (3) ప్రకారం సుప్రీంకోర్ట్ న్యాయమూర్తిగా నియమించడానికి కింది అర్హతలుండాలి.

ఎ) భారత పౌరుడై ఉండాలి.

బి) 65 సం.లు నిండి ఉండరాదు

సి) ఏదైనా హైకోర్ట్‌లో న్యాయమూర్తిగా 5 సంవత్సరాల అనుభవం ఉండాలి లేదా ఏదైనా హైకోర్ట్‌లో 10 సంవత్సరాలుగా న్యాయవాదిగా పని చేసి ఉండాఇ.

డి) రాష్ట్రపతి దృష్టిలో న్యాయశాస్త్రంలో నిష్ణాతుడై ఉండాలి.

## పదవీ ప్రమాణ స్వీకారం :

సుప్రీంకోర్ట్ జడ్జీలు పదవిని చేపట్టే ముందు, రాష్ట్రపతి లేదా అతను సూచించిన ప్రతినిధి (ప్రధాన న్యాయమూర్తి) ముందు పదవీ ప్రమాణ స్వీకారం చేస్తారు. రాజ్యాంగానికి అనుగుణంగా దేశ ఐక్యతను,

SAKSHI

సమగ్రతను కాపాడుతూ విధేయత, సమర్థతతో ఎలాంటి పక్షపాతం లేకుండా నిర్భయంగా విధులను నిర్వర్తిస్తూ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని ప్రమాణం చేస్తారు.

### జడ్జీల పదవీ కాలం :

సుప్రీంకోర్ట్ జడ్జీలకు నిర్ణీత పదవీకాలముండదు. 65 సంవత్సరాలు వయసు వచ్చే వరకు పదవిలో ఉంటారు. సుప్రీంకోర్ట్ జడ్జీల వయసుకు సంబంధించిన వివాదాలను పార్లమెంట్ నిర్ణయించిన, ఏర్పరిచిన ఒక అథారిటీ పరిష్కరిస్తుంది. ఇంతవరకు ఎలాంటి అథారిటీ ఏర్పరచలేదు. ప్రస్తుతం ఇలాంటి వివాదాలను సుప్రీంకోర్ట్ పరిష్కరిస్తుంది.

సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులు తమ రాజీనామా పత్రాన్ని రాష్ట్రపతికి సంబోధిస్తారు.

### సుప్రీంకోర్ట్ జడ్జీల తొలగింపు – అభిశంసనా తీర్మానం (Censure Motion) :

ప్రకరణ 124 (4) ప్రకారం సుప్రీంకోర్ట్ జడ్జీలను తొలగించే విధానాన్ని అభిశంసనా పద్ధతి అంటారు. సుప్రీంకోర్ట్ జడ్జీలను తొలగించడానికి రెండు కారణాలను పేర్కొన్నారు.

1. అసమర్థత (incapacity)
2. అక్రమ ప్రవర్తన (Misbehaviour)

తొలగించే తీర్మానాన్ని ఉభయ సభలలో ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు. అయితే జడ్జీల విచారణ చట్టం, 1968 ప్రకారం కింది నియమాలను పాటించాలి.

- లోక్‌సభలో అయితే తొలగించే తీర్మాన నోటీసుపై 100 మంది సభ్యులు, అదే రాజ్యసభలో అయితే 50 మంది సభ్యులు సంతకాలు చేసి లేదా చైర్మన్ నోటీస్ ఇవ్వాలి. వారు దీనిని అనుమతించవచ్చు లేదా తిరస్కరించవచ్చు.
- న్యాయమూర్తులపై వచ్చిన అభియోగాలను విచారణ చేయడానికి సభాధ్యక్షులు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని నియమిస్తారు. ఇందులో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఒక హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి, ఒక సుప్రసిద్ధ న్యాయ శాస్త్రజ్ఞుడు సభ్యులుగా ఉంటారు.
- జడ్జీపై వచ్చిన అభియోగాలు విచారణలో ఋజువు అయినట్లు తేలితే తొలగించే తీర్మానాన్ని ఉభయసభలు వేరువేరుగా ప్రత్యేక మెజార్టీతో, అంటే హాజరై ఓటు వేసిన సభ్యులలో 2/3వ వంతు మెజార్టీ సభ్యులు, మొత్తం సభ్యులలో సాధారణ మెజార్టీకి తగ్గకుండా ఆమోదించాల్సి ఉంటుంది. ఈ తీర్మానం మేరకు జడ్జీలను తొలగిస్తూ రాష్ట్రపతి ఆదేశాన్ని జారీ చేస్తారు. ఇంతవరకు సుప్రీంకోర్టు జడ్జీలు ఎవరూ తొలగించబడలేదు. అయితే 1991–93 మధ్య సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ వి. రామస్వామిపై అవినీతి కారణాలపైన లోక్‌సభలో తీర్మానం ప్రవేశపెట్టారు కానీ అది వీగిపోయింది.

SAKSHI

## న్యాయమూర్తుల జీతభత్యాలు :

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల జీతభత్యాలను పార్లమెంట్ ఒక చట్టం ద్వారా నిర్ణయిస్తుంది. వీటిని కేంద్ర సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. ఆర్థిక అత్యవసర పరిస్థితిలో మినహా ఇతర సందర్భాలలో తగ్గించడానికి అవకాశం లేదు. జీతభత్యాల గురించి రెండవ షెడ్యూల్‌లో పేర్కొన్నారు. 2009లో వీరి జీతభత్యాలను కింది విధంగా పెంచారు.

| | పాత వేతనం | కొత్త వేతనం |
|---|---|---|
| సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి | 33,000 | 1,00,000 |
| సుప్రీంకోర్టు సాధారణ న్యాయమూర్తులు | 30,000 | 90,000 |
| హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి | 30,000 | 90,000 |
| హైకోర్టు సాధారణ న్యాయమూర్తులు | 26,000 | 80,000 |

జీతంతో పాటు ఉచిత నివాసం, ఇతర సౌకర్యాలు, పదవీ విరమణ తర్వాత పెన్షన్ సౌకర్యం ఉంటుంది.

## తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి :

ప్రకరణ 126 ప్రకారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవిలో ఖాళీ ఏర్పడినా లేదా అనివార్య కారణాల వల్ల తన విధులను నిర్వర్తించలేని సందర్భంలో రాష్ట్రపతి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిని నియమిస్తాడు.

## తాత్కాలిక న్యాయమూర్తులు (Ad hoc Judges) :

ప్రకరణ 127 ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులలో కోరమ్ లేనప్పుడు రాష్ట్రపతి పూర్వానుమతితో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని, కొంతమంది తాత్కాలిక న్యాయమూర్తులను నియమించవచ్చు. తాత్కాలిక న్యాయమూర్తిగా నియమింపబడే వ్యక్తికి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి నియామకానికి ఉండవలసిన అన్ని అర్హతలు ఉండాలి. ప్రకరణ 128 ప్రకారం సుప్రీంకోర్టులో పదవీ విరమణ చేసిన జడ్జీలను కూడా, కేసులు అధికంగా ఉన్నప్పుడు పదవిలో కొనసాగమని రాష్ట్రపతి అనుమతితో ప్రధాన న్యాయమూర్తి కోరవచ్చు.

## సుప్రీంకోర్టు అధికార విధులు

సుప్రీంకోర్టు దేశంలో ఉన్న అత్యున్నత న్యాయస్థానం. దీని పరిధి దేశవ్యాప్తంగా ఉంటుంది. విస్తృతమైన అధికారాలు కలిగి ఉంటుంది. రాజ్యాంగ పరిషత్ సభ్యుడు అల్లాడి కృష్ణస్వామి వర్ణించారు. దేశంలో ఫెడరల్ కోర్టుగా, అత్యున్నత అప్పీలు కోర్టుగా, రాజ్యాంగ పరిరక్షణ కర్తగా అనేక విధులను నిర్వర్తిస్తుంది. వీటిని కింది విధంగా వర్గీకరించవచ్చు.

ఎ. స్వతఃసిద్ధ/ప్రాథమిక అధికార పరిధి (Original Jurisdiction)

బి. అప్పీళ్ళ విచారణ పరిధి (Appellate Jurisdiction)

సి. సలహా పూర్వక విచారణ పరిధి (Advisory Jurisdiction)

డి. కోర్ట్ ఆఫ్ రికార్డు (Court of Record)

ఇ. రిట్ పరిధి (Writ Jurisdiction)

ఎఫ్. న్యాయ సమీక్షాధికారం (Power of Judicial Review)

జి. ఇతర అధికారాలు (Other Powers)

**ప్రారంభ అధికారం :**

ప్రకరణ 131 ప్రకారం ప్రారంభ అధికారం అనేది సుప్రీంకోర్టు సమాఖ్య స్వభావాన్ని తెలియజేస్తుంది. సమాఖ్య వివాదాలన్నింటిని సుప్రీంకోర్టులోనే పరిష్కరించుకోవాలి. కొన్ని వివాదాలను సుప్రీంకోర్టు మాత్రమే పరిష్కరిస్తుంది.

**ఉదా :**

ఎ. కేంద్ర, రాష్ట్ర వివాదాలు

బి. అంతరాష్ట్ర వివాదాలు

సి. కేంద్రం, రాష్ట్రాలు మరికొన్ని రాష్ట్రాల వివాదాలు

డి. ప్రాథమిక హక్కుల పరిరక్షణ

ఇ. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల వివాదాలు

1961లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి బొగ్గు గనుల ప్రాంతాల స్వాధీనం, అభివృద్ధి చట్టం విషయంలో తొలిసారిగా కేంద్రం, రాష్ట్రాల మధ్య వివాదం ఏర్పడింది.

**సుప్రీంకోర్టు ప్రాథమిక పరిధికి మినహాయింపు :**

కింది వివాదాలు సుప్రీంకోర్టు ప్రాథమిక పరిధి నుంచి మినహాయించారు.

- కేంద్ర, ఆర్థిక సంఘం పరిధిలోకి వచ్చే విషయాలు
- అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదాలు
- కేంద్ర, రాష్ట్రాల మధ్య కుదిరే ప్రత్యేక ఒప్పందాలు (సుప్రీంకోర్టు ప్రాథమిక పరిధి నుంచి మినహాయించబడతాయి అనే షరతును ఆ ఒప్పందంలో అంతర్భాగం చేసినపుడు)
- కేంద్రం నుంచి రాష్ట్రాలు నష్టపరిహారం రాబట్టే వివాదాలు
- సుప్రీంకోర్టు ఏర్పడక ముందే కుదుర్చుకున్న ఒప్పందాలు, సుప్రీంకోర్టు అమలులోకి వచ్చిన తర్వాత సమకాలీన పరిస్థితులలో వివాదం అయిన అంశాలు

**అప్పీళ్ళు – పరిధి :**

సుప్రీంకోర్టు అనేది దేశంలో అత్యున్నతమైన అప్పీళ్ళ కోర్టు. కింది విషయాలపై సుప్రీంకోర్టు అప్పీళ్ళ పరిధి ఉంటుంది.

**ఎ. రాజ్యాంగపరమైన వివాదాలు (ప్రకరణ 133)**

హైకోర్టు చెప్పిన తీర్పులలో రాజ్యాంగాన్ని మరింత లోతుగా వ్యాఖ్యానించవలసిన అవసరం ఉందని హైకోర్టు

SAKSHI

ధృవీకరిస్తే అలాంటి కేసులను సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకోవచ్చు.

### బి. సివిల్ వివాదాలలో అప్పీళ్ళు (ప్రకరణ 133)

ఏదైనా సివిల్ వివాదంలో హైకోర్టు ఇచ్చిన తీర్పులో చట్టానికి సంబంధించిన లోతైన అంశం ఇమిడి ఉందని భావించినా, లేదా హైకోర్టు ఈ వివాదంలో రాజ్యాంగపరమైన అంశం ఇమిడి ఉందని భావించి ధృవీకరిస్తే సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకోవచ్చు.

### సి. క్రిమినల్ వివాదాలు (ప్రకరణ 134)

హైకోర్టు కింది న్యాయస్థానాలు ప్రకటించిన తీర్పులను అప్పీలు స్వీకరించి, కింది కోర్టు చెప్పిన తీర్పుకు పూర్తి విరుద్ధంగా తీర్పు చెప్పి, ముద్దాయికి మరణశిక్ష విదించినపుడు, కింది కోర్టు విధించిన మరణ శిక్షను పునఃసమీక్షించి, మరణశిక్షను కోర్టు రద్దు చేసిన సందర్భాలలో సుప్రీంకోర్టుకు అప్పీళ్ళు చేసుకోవచ్చు.

### డి. సుప్రీంకోర్టు ప్రత్యేక అనుమతిలో అప్పీలు (Special Leave Petetion) :

కొన్ని ప్రత్యేక సందర్భాలలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకోవచ్చు. హైకోర్టు ఇచ్చిన తీర్పు ద్వారా బాధితునికి న్యాయం జరగనపుడు, సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకుంటే న్యాయం జరుగుతుందని బాధితుడు, కోర్టును ఒప్పించగలిగితే, ఆ సందర్భంలో కోర్టు అనుమతితో అప్పీలు చేసుకోవచ్చు. ఇది సుప్రీంకోర్టు విచక్షణాధికారంపై ఆధారపడి ఉంటుంది.

### సలహా పూర్వక విచారణ పరిధి :

ప్రకరణ 143 ప్రకారం రాష్ట్రపతి కింది విషయాలలో సుప్రీంకోర్టు సలహాను కోరవచ్చు.

- చట్టానికి సంబంధించిన వివాదం కానీ లేదా ప్రజాప్రాముఖ్యం కలిగిన ఒక సంఘటనకు సంబంధించిన వాస్తవాలను తెలుసుకునే విషయంలో కానీ,
- రాజ్యాంగం రాక మునుపు కుదుర్చుకున్న ఒప్పందాలకు సంబంధించిన వివాదాలలో రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహాను కోరవచ్చు.
- మొదటి రకం వివాదాలలో సుప్రీంకోర్టు తన అభిప్రాయాన్ని వ్యక్తీకరించవచ్చు లేదా వ్యక్తీకరించడానికి నిరాకరించవచ్చు.
- రెండవ రకం వివాదాలలో సుప్రీంకోర్టు తన అభిప్రాయాన్ని తప్పనిసరిగా వ్యక్తీకరించాలి. (ప్రకరణ 131 ప్రకారం ప్రారంభ అధికార పరిధి నుంచి మినహాయించబడిన అంశాలు)
- పై రెండూ సందర్భాలలోను సుప్రీంకోర్టు వ్యక్తీకరించిన అభిప్రాయాన్ని (సలహాను) రాష్ట్రపతి పరిగణనలోకి తీసుకోవచ్చు లేదా తీసుకోకపోవచ్చు అయితే
- సుప్రీంకోర్టు వ్యక్తీకరించిన అభిప్రాయాలను దిగువ కోర్టులు తప్పనిసరిగా పాటించాలి.
- ఇంతవరకు రాష్ట్రపతి 14 అంశాలకు సంబంధించిన వివాదాలలో సుప్రీంకోర్టు సలహాను కోరడమైంది.

SAKSHI

ఈ మధ్యనే 2006లో ''లాభదాయకమైన పదవులు మినహాయింపు'' బిల్లు విషయంలో అప్పటి రాష్ట్రపతి డా॥ అబ్దుల్ కలామ్ సుప్రీంకోర్టు సలహాను కోరడం జరిగింది.

### కోర్టు ఆఫ్ రికార్డు :

ప్రకరణ 129 ప్రకారం సుప్రీంకోర్టు వెలువరించిన అన్ని తీర్పులు, ప్రక్రియలు దేశ వ్యాప్తంగా అన్ని దిగువ న్యాయస్థానాలలో సాక్ష్యాలుగా, ఆధారాలుగా స్వీకరించాలి. దిగువ కోర్టులు, సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులనే ప్రామాణికంగా చేసుకొని, సంబంధిత వివాదాలలో తీర్పును చెప్పాల్సి ఉంటుంది. దేశంలోని వ్యక్తులు, సంస్థలు సుప్రీంకోర్టు తీర్పును గౌరవించాలి, లేదంటే దానిని కోర్టు ధిక్కార నేరంగా పరిగణించి రూ 2000 ల జరిమానా, ఆరు నెలల వరకు శిక్ష విధించే అధికారం ఉంది.

### రిట్లు జారీ చేసే అధికారం :

ప్రకరణ 32 ప్రకారం సుప్రీంకోర్టు ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం హెబియస్ కార్పస్, మాండమస్, ప్రొహిబిషన్, సెర్షియోరరి, కోవారంటో రిట్‌లను జారీ చేస్తుంది.
రిట్‌లు జారీ చేసే అధికారం సుప్రీంకోర్టు ప్రాథమిక అధికార పరిధిలోకి వస్తుంది.

### న్యాయ సమీక్షాధికారం :

శాసనసభలు, ప్రభుత్వాలు జారీ చేసిన ఆదేశాలను, చట్టాలను వాటి రాజ్యాంగ బద్ధతను పరిశీలించి, అవి రాజ్యాంగ విరుద్ధమైతే వాటిని చెల్లుబాటు కాకుండా తీర్పులు చెబుతుంది.

### ఇతర అధికారాలు :

సుప్రీంకోర్టుకు కింద పేర్కొన్న అధికారాలు కూడా కలిగి ఉంటుంది.

**రాజ్యాంగ పరిరక్షణ కర్త :** సమాఖ్యలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగం నిర్దేశించిన పరిధిలో పని చేసేలా నియంత్రిస్తుంది. ప్రజల ప్రాథమిక హక్కులను రక్షిస్తుంది.

- రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించే విషయంలో సుప్రీంకోర్టుదే అంతిమ నిర్ణయం
- రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల వివాదాన్ని పరిష్కరిస్తుంది.
- యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్, ఇతర సభ్యులు, అలాగే రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ చైర్మన్ సభ్యుల తొలగింపు విషయాలలో రాష్ట్రపతి సుప్రీంకోర్టు చేత విచారణ చేయిస్తారు.
- సుప్రీంకోర్టు తన తీర్పును తనే మార్పు చేసుకునే అధికారం ఉంది. దీనిని పునఃసమీక్షాధికారం అంటారు.

SAKSHI

## సుప్రీంకోర్టు న్యాయ సమీక్షాధికారం – ఒక విశ్లేషణ :

భారత రాజ్యాంగ పరిషత్తు అత్యంత శ్రద్ధ చూపిన ప్రధాన అంశాలలో న్యాయశాఖ స్వయం ప్రతిపత్తి, న్యాయసమీక్ష అనే రెండు భావనలున్నాయి. ప్రాథమిక హక్కుల పరిరక్షణకు సమాఖ్య వివాదాల పరిష్కారం, రాజ్యాంగ ఆధిక్యతను పరిరక్షించడానికి న్యాయశాఖ స్వతంత్ర ప్రతిపత్తికి న్యాయసమీక్ష దోహదం చేస్తుంది.

న్యాయసమీక్ష అనే భావన అమెరికా రాజ్యాంగం నుంచి వచ్చింది. 1803లో మార్బరీ, మాడిసన్‌ల మధ్య జరిగిన వివాదంలో అమెరికా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జాన్ మార్షల్ చేసిన ప్రసిద్ధ నిర్ణయం నుంచి న్యాయసమీక్ష సూత్రం పుట్టింది.

రాజ్యాంగ పరిషత్ సభ్యులు కె.యం. మున్షి అభిప్రాయం ప్రకారం శాసనం చేత నిర్ణయించబడిన పద్ధతిలో అనివార్యం. రాజ్యాంగంలో ప్రకరణ 13 (2)లో న్యాయసమీక్షాధికారాన్ని న్యాయవ్యవస్థకు కల్పించడం జరిగింది. శాసనాలు, ఆదేశాలు ఇతర నోటిఫికేషన్లు, ప్రకరణ 13 ప్రకారం ప్రాథమిక హక్కులకు విరుద్ధమైతే సుప్రీంకోర్టు వాటిని కొట్టివేస్తుంది. దీనినే న్యాయసమీక్షాధికారం అంటారు.

## న్యాయసమీక్ష – చారిత్రక పరిణామం – ముఖ్య వివాదాలు

1951లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో వైద్య కళాశాలలో కొన్ని కులాలకు రిజర్వేషన్ కోసం చేసిన చట్టాలను హైకోర్టు కొట్టివేస్తే హైకోర్టు తీర్పును సుప్రీంకోర్ట్ సమర్థించింది. కొన్ని కులాలకు సాయం చేసే ఉద్దేశంతో ఇతర కులాలకు అన్యాయం జరగకుండా చూడాలని పేర్కొంది. 1951లో ఎ.కె.గోపాలన్, స్టేట్ ఆఫ్ మద్రాస్ వివాదంలో సెమినార్ పత్రిక సంపాదకుడైన రమేష్ థాపర్‌ను కారణాలు చెప్పకుండా నిర్బంధించడం వ్యక్తి స్వేచ్ఛకు భంగమని, వెంటనే విడుదల చేయమని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

1952లో శంకరీ ప్రసాద్ వివాదం, 1965లో సజ్జన్ సింగ్ వివాదంలో పార్లమెంట్‌కు ప్రాథమిక హక్కులను సవరించే అధికారం ఉందని, తద్వారా జమిందారీ, జాగీర్దారీ విధానాలను రద్దు చేసి పార్లమెంటరీ అధికారాన్ని కోర్టు సమర్ధించింది.

1967 గోలక్‌నాథ్, స్టేట్ ఆఫ్ పంజాబ్ వివాదంలో ప్రధాన న్యాయమూర్తి కోకా సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రకరణ 13కు సంబంధించిన సవరణ గురించి తీర్పు చెబుతూ నిబంధన 368 ప్రకారం చేసే రాజ్యాంగ సవరణలు, ప్రకరణ 13 పరిధిలోకి వస్తాయి కాబట్టి అవి చెల్లదని తీర్పు చెప్పింది. పార్లమెంట్‌కు రాజ్యాంగాన్ని సవరించే అధికారం లేదని పేర్కొంది.

1969లో బ్యాంకుల జాతీయకరణ, రాజ భరణాల రద్దు కోసం చేసిన ఆర్డినెన్సులను ప్రాథమిక హక్కుల పరిరక్షణ దృష్ట్యా చెల్లవని తీర్పు చెప్పింది.

1973లో కేశవానంద భారతి, స్టేట్ ఆఫ్ కేరళ వివాదంలో రాజ్యాంగానికి చేసిన 24, 25వ గోలక్‌నాథ్ వివాదంలో వచ్చిన తీర్పును మార్చి పార్లమెంట్‌కు ప్రాథమిక హక్కులను సవరించే అధికారం ఉందని అయితే రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చరాదని 13 మంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనంలో తొమ్మిది మంది న్యాయమూర్తులు, ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎం.సిక్రి ఆధ్వర్యంలో తీర్పు ఇవ్వడం జరిగింది.

1980లో మినర్వాయిల్స్ వివాదంలో 42వ రాజ్యాంగ సవరణ సుప్రీంకోర్టు పరిశీలనకు వచ్చినప్పుడు

SAKSHI

రాజ్యాంగ మౌలిక సూత్రాన్ని మరలా నొక్కి చెప్పి, రాజ్యాంగాన్ని సవరించడానికి పార్లమెంట్‌కు పరిమిత అధికారమే ఉందని స్పష్టం చేసింది. అలాగే న్యాయ సమీక్షాధికారం రాజ్యాంగ మౌలిక లక్షణాలలో అంతర్భాగం అని, దానిని పరిమితం చేయడం లేదా మొత్తానికి తీసివేయడం జరగదని సుప్రీంకోర్టు తన తీర్పును వెలువరించింది.

## న్యాయవ్యవస్థ – క్రియాశీలత – ప్రజాప్రయోజనాల వ్యాజ్యం (Public Interest Litigation):

న్యాయశాఖ క్రియాశీలత అనేది న్యాయసమీక్ష అధికారంలో అంతర్భాగం, న్యాయశాఖ క్రియాశీలత అంటే న్యాయవ్యవస్థ తన అధికార విధులను మరింత చొరవగా, క్రియాశీలకంగా ఉదారంగా వినియోగించడం. న్యాయాన్ని ప్రజలకు అందించే క్రమంలో అనేక నూతన పద్ధతులను ప్రక్రియలను వినియోగించి సమ న్యాయపాలనకు అవసరమైన అన్ని చర్యలను చేబడుతుంది.

## న్యాయశాఖ క్రియాశీలతకు కారణాలు :

- శాసనశాఖ, కార్య నిర్వాహక శాఖ తమ విధుల నిర్వహణలో వైఫల్యం చెంది ప్రజల నమ్మకాన్ని కోల్పోవడం.
- ఓటు బ్యాంకు రాజకీయాల వల్ల దీర్ఘకాలిక, నిర్మాణాత్మక, కఠినమైన నిర్ణయాలు చేయకపోవడం వల్ల ప్రజల కనీస అవసరాలు కూడా మెరుగుపరచని స్థితిలో ప్రభుత్వాలు కొనసాగడం.
- ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం ద్వారా మూడో వ్యక్తి కూడా కోర్టును ఆశ్రయించే అవకాశాన్ని కల్పించడం ద్వారా స్వచ్ఛంద సంస్థలు పౌరహక్కుల సంఘాలు, వందల సంఖ్యలో ప్రజా ప్రయోజనాలున్న కేసులను హైకోర్టు, సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చారు.
- న్యాయస్థానాలు, స్వయంప్రేరిత (Suo-Moto) కేసులను ప్రవేశపెట్టి ప్రజల హక్కుల కోసం తగిన ఆదేశాలను జారీ చేయడం.
- దత్త శాసనాధికారాల వల్ల కార్యనిర్వాహకశాఖ అధికారాలు విస్తృతమై అధికార దుర్వినియోగం, జవాబుదారీతనం లోపించడం.

## న్యాయశాఖ క్రియాశీలత – ముఖ్య వివాదాలు

- ఫరీదాబాద్ గనులలో పనిచేసే బాలకార్మిక స్థితిగతులపై బందువా ముక్తి మోర్చా వివాదంలో సుప్రీంకోర్ట్ తీర్పు
- లక్ష్మీకాంత, యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న మోసాలు, చిన్నపిల్లల దత్తత వివాదంలో సుప్రీంకోర్టు తీర్పులు
- తాజ్‌మహల్ పరిసర ప్రాంతాలలో కాలుష్యం, తద్వారా తాజ్‌మహల్‌కున్న ముప్పు కేసులు
- బీహార్ పశుగ్రాసం కేసు
- జార్ఖండ్ ముక్తి మోర్చా అవినీతి వివాదం

SAKSHI

- రక్షణ శాఖలో కొనుగోలు కుంభకోణాలు మొదలగు వివాదాలలో
- జడ్జీల నియమం
- కర్ణాటక ముఖ్యమంత్రి ఎస్.ఆర్.బొమ్మై తొలగింపు వివాదం మొదలగు కేసులలో సుప్రీంకోర్టు క్రియాశీలమైన తీర్పులను వెలువరించింది.

## న్యాయ ప్రవర్తన (Judicial Behaviour) :

న్యాయప్రవర్తన అనే ప్రక్రియ ఇటీవల కాలంలో ప్రాముఖ్యతను సంతరించుకుంది. సమాచార హక్కు చట్టం, రాజకీయ ప్రక్రియల అధ్యయనంలో ప్రవర్తన పద్ధతి అనుసరించడం వల్ల న్యాయమూర్తులను ప్రభావితం చేస్తున్న అంశాలు వారి క్రమశిక్షణ, పనితీరు, నిబద్ధత మొదలగు విషయాలు ప్రజా సమీక్షకు గురి అవుతున్నాయి. న్యాయమూర్తులు శీఘ్రగతిని కేసులు విచారించడం, విచారణ సమయంలో విపరీత జాప్యానికి బాధ్యత వహింపచేయడం, న్యాయమూర్తుల ప్రవర్తన ఆదర్శంగా ఉండేలా చేయడం మొదలగు అంశాల పరిశీలనను న్యాయవ్యవస్థ ప్రవర్తన అంటారు. న్యాయమూర్తులు రకరకాల ప్రభావాలకు, ప్రలోభాలకు దూరంగా ఉండడం, వృత్తి నిబద్ధతను, నిష్పాక్షికతను అత్యున్నతమైన వ్యక్తిత్వాన్ని, జాతి, మత, కుల ప్రాంతాలకు అతీతంగా తీర్పులను వెలువరించే గొప్ప లక్షణాలను కలిగి ఉండాలి. అప్పుడే ప్రజలకు న్యాయవ్యవస్థ పైన విశ్వాసం ద్విగుణీకృతం అవుతుంది.

## సుప్రీంకోర్టు–హైకోర్టుల స్వతంత్ర ప్రతిపత్తి – రాజ్యాంగ రక్షణలు :

న్యాయమూర్తుల స్వతంత్ర ప్రతిపత్తి పరిరక్షణకు రాజ్యాంగాలలో అనేక ఏర్పాట్లు ఉన్నాయి. అవి

- న్యాయమూర్తుల నియామకానికి సంబంధించిన అర్హతలను రాజ్యాంగమే నిర్ణయించింది.
- సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు తమ పదవీ విరమణ వయస్సు వచ్చే వరకు పదవిలో ఉంటారు. కార్యనిర్వాహక శాఖ న్యాయమూర్తులను నియమించినప్పటికి వీరిని తొలగించలేదు. ఇది న్యాయశాఖ నిష్పక్షపాత వైఖరికి దోహదం చేస్తుంది.
- న్యాయమూర్తులకు సరైన వేతనాలను వారి హోదాకు తగ్గట్లుగా చెల్లిస్తారు. వీరు పదవిలో ఉండగా జీతభత్యాలను తగ్గించడానికి అవకాశం లేదు.
- న్యాయమూర్తుల ప్రవర్తన, సమర్థతపై ఎక్కడ చర్చించడానికి వీలు లేదు. ఈ అంశాలపై చర్చ చేయాలంటే అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాల్సి ఉంటుంది.
- సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పదవీ విరమణ తర్వాత దేశంలో ఏ న్యాయస్థానంలోనూ న్యాయవాది వృత్తిని చేపట్టరాదు. అయితే హైకోర్టు న్యాయమూర్తులు పదవీ విరమణ తర్వాత వారు పని చేసిన హైకోర్టులో మినహా మిగతా హైకోర్టులలోను, సుప్రీంకోర్టులోనూ న్యాయవాద వృత్తిని చేపట్టవచ్చు.
- కోర్టు తీర్పులను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించిన లేదా తీర్పులకు పక్షపాతం ఆపాదించిన అలాంటి వారిని కోర్టుధిక్కార నేరం కింద శిక్షించవచ్చు.

SAKSHI

## హైకోర్టు

రాష్ట్రంలో ఉన్న అత్యున్నతమైన న్యాయస్థానాన్ని హైకోర్ట్ అంటారు. రాజ్యాంగం 6వ భాగం ప్రకరణలు 214 నుంచి 231 వరకు రాష్ట్రస్థాయిలో హైకోర్టులు వాటి నిర్మాణం, అధికార విధుల గురించి ప్రస్తావించారు.

ప్రకరణ 214 ప్రకారం ప్రతి రాష్ట్రంలో ఒక హైకోర్టు ఉంటుంది. అయితే ప్రకరణ 231 ప్రకారం రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలకు ఒక ఉమ్మడి హైకోర్టును పార్లమెంట్ చట్టం ఏర్పాటు చేయవచ్చు. ప్రస్తుతం మహారాష్ట్ర-గోవాకు బొంబాయిలో పంజాబ్-హర్యానాకు చండీఘడ్‌లో, అన్ని ఈశాన్య రాష్ట్రాలకు కలిపి అస్సాంలోని గౌహతిలో ఉమ్మడి హైకోర్టులు పని చేస్తున్నాయి.

కేంద్రపాలిత ప్రాంతాలు సమీప రాష్ట్ర హైకోర్టు పరిధిలోకి వస్తాయి. స్వంత హైకోర్ట్ కలిగిన ఏకైక కేంద్ర పాలిత ప్రాంతం ఢిల్లీ. దేశంలో మొట్టమొదటి సారిగా హైకోర్టును 1862లో కలకత్తాలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దేశంలో 21 హైకోర్టులున్నాయి.

## హైకోర్టు నిర్మాణం :

ప్రకరణ 216 ప్రకారం ప్రతి హైకోర్టులో ఒక ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్రపతి నిర్ణయించిన సంఖ్యలో ఇతర న్యాయమూర్తులుంటారు. న్యాయమూర్తుల సంఖ్య రాష్ట్రాలను బట్టి మారుతుంది. ప్రకరణ 217 ప్రకారం రాష్ట్రపతి హైకోర్టు న్యాయమూర్తులను నియమిస్తారు. నియామక సమయంలో రాష్ట్రపతి వీరిని సంప్రదించాలి.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఆ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని, ఆ రాష్ట్ర గవర్నర్‌ను, ఆ రాష్ట్ర హైకోర్టు వ్యవహారాలు తెలిసిన సుప్రీంకోర్టులోని ఇద్దరు ఇతర న్యాయమూర్తులను సంప్రదించాల్సి ఉంటుంది.

### అర్హతలు :

- భారత పౌరుడై ఉండాలి.
- 62 సంవత్సరాలు నిండి ఉండరాదు
- ఏదైనా హైకోర్టులో 10 సంవత్సరాలు తక్కువ కాకుండా న్యాయవాదిగా అనుభవం ఉండాలి లేదా
- కేంద్ర, రాష్ట్ర న్యాయ సర్వీసులలో 10 సంవత్సరాల న్యాయాధికారిగా అనుభవం ఉండాలి.

**సూచన :** మౌలిక రాజ్యాంగంలో హైకోర్ట్ న్యాయమూర్తుల పదవీ విరమణ వయస్సు 60 సంవత్సరాలే ఉండేది. అయితే 1963లో 15వ రాజ్యాంగ సవరణ ద్వారా పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచారు. 2010లో 62 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాలకు పెంచుతూ 114వ రాజ్యాంగ సవరణను ప్రవేశపెట్టడం జరిగింది.

## పదవీ ప్రమాణ స్వీకారం :

ప్రకరణ 219 ప్రకారం రాష్ట్ర గవర్నర్ లేదా అతనిచే నియమించబడిన వ్యక్తి ముందు హైకోర్టు న్యాయమూర్తులు పదవీ ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ ప్రక్రియ గురించి మూడవ షెడ్యూల్లో పేర్కొనడం జరిగింది.

SAKSHI

### జీతభత్యాలు :

ప్రకరణ 2211 ప్రకారం హైకోర్టు న్యాయమూర్తుల జీతభత్యాలను పార్లమెంట్ చట్టం ద్వారా నిర్ణయిస్తుంది. వీటిని రాష్ట్ర సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. ఆర్థిక అత్యవసర పరిస్థితుల్లో మినహా ఎప్పుడు తగ్గించడానికి వీలు లేదు. 2009లో వీరి వేతనాలను పెంచడం జరిగింది.

- హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి వేతనం రూ. 90,000/-
- సాధారణ న్యాయమూర్తుల వేతనం రూ. 80,000
- పదవీ విరమణ తరువాత పెన్షన్ సౌకర్యం కూడా ఉంటుంది. వీరి పెన్షన్ మాత్రం కేంద్ర సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు.

### హైకోర్టు న్యాయమూర్తుల తొలగింపు పద్ధతి – అభిశంసనా తీర్మానం :

ప్రకరణ 218 ప్రకారం హైకోర్టు న్యాయమూర్తులు తొలగించబడతారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులను తొలగించే పద్ధతి ప్రకారం హైకోర్టు న్యాయమూర్తులు తొలగించబడతారు. ఇప్పటి వరకు ఎవరు తొలగించబడలేదు. అయితే ప్రస్తుతం సిక్కిం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేస్తున్న జస్టిస్ పి.డి.దినకరన్ తొలగింపు ప్రక్రియ రాజ్యసభ పరిశీలనలో ఉంది.

**హైకోర్టు అధికారం, విధులు**

హైకోర్టు అధికారాలను ఈ విధంగా వర్గీకరించవచ్చు.

1. ప్రారంభ లేదా ప్రాథమిక పరిధి, అధికారం
2. అప్పీళ్ళ పరిధి
3. రిట్లు, అధికార పరిధి
4. కోర్ట్ ఆఫ్ రికార్డు
5. పర్యవేక్షక అధికారాలు

### ప్రారంభ పరిధి :

కొన్ని రకాల వివాదాలను హైకోర్టులోనే నేరుగా పరిష్కరించుకోవాలి. పార్లమెంట్ సభ్యుల ఎన్నిక వివాదం, రాష్ట్ర శాసన సభ్యుల ఎన్నిక వివాదం, ప్రాథమిక హక్కుల పరిరక్షణ కంపెనీ చట్టాల వివాదాలు, కాపీరైట్ వివాదాలు మొదలైన అంశాలు హైకోర్టు ప్రారంభ పరిధిలోకి వస్తాయి.

### అప్పీళ్ల పరిధి:

రాష్ట్రంలో దిగువ కోర్టులు ఇచ్చిన తీర్పులను హైకోర్టుకు అప్పీలు చేసుకోవచ్చు. సివిల్ వివాదాలలో కేసు విలువతో సంబంధం లేకుండా ఎలాంటి వివాదాన్నైనా అప్పీలు చేసుకోవచ్చు. క్రిమినల్ వివాదాలలో సెషన్సు కోర్టు విధించిన మరణశిక్షను, అలాగే ఏడు సంవత్సరాల కంటే ఎక్కువ శిక్ష పడిన కేసులన్నింటిని హైకోర్టుకు అప్పీలు చేసుకోవచ్చు.

SAKSHI

### రిట్లు జారీ చేసే అధికారం

ప్రకరణ 226 ప్రకారం హైకోర్ట్ ప్రాథమిక హక్కుల పరిరక్షణకు హెబియస్‌కార్పస్, మాండమస్, ప్రొహిబిషన్, సెర్షియోరరి, కో–వారెంటో మొదలైన రిట్లను జారీ చేస్తుంది. రిట్టు జారీ చేసే అధికారం సుప్రీంకోర్టు కంటే హైకోర్టుకే ఎక్కువ. సుప్రీంకోర్టు ప్రాథమిక హక్కుల పరిరక్షణకు మాత్రమే రిట్లు జారీ చేస్తుంది. హైకోర్టు ప్రాథమిక హక్కుల పరిరక్షణతో పాటు ఇతర హక్కుల పరిరక్షణకు కూడా రిట్లు జారీ చేయవచ్చు.

### కోర్ట్ ఆఫ్ రికార్డు

ప్రకరణ 215 ప్రకారం హైకోర్ట్, కోర్ట్ ఆఫ్ రికార్డుగా వ్యవహరిస్తుంది. హైకోర్టు తీర్పులను రాష్ట్రంలోని అన్ని దిగువ న్యాయస్థానాలు, సంస్థలు, వ్యక్తులు గౌరవించాలి. ఈ తీర్పులను దిగువ న్యాయస్థానాల్లో సాక్ష్యాలు, అధికారులుగా తీసుకొని తమ తీర్పులను వెలువరించాలి. తీర్పును ధిక్కరించనివారు కోర్టు ధిక్కార నేరం కింది శిక్షార్హులు.

### న్యాయసమీక్షాధికారం (ప్రకరణ 226) :

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చట్టాల రాజ్యాంగబద్ధతను పరిశీలించి, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైతే చట్టాలను న్యాయసమీక్ష అధికారం ద్వారా కొట్టివేస్తుంది.

### పర్యవేక్షణాధికారాలు:

రాష్ట్రంలో ఉన్న దిగువ న్యాయస్థానాలపై పరిపాలనా పరమైన, న్యాయపరమైన పర్యవేక్షణ చేస్తుంది. దిగువ న్యాయస్థానాలు పాటించాల్సిన విధి విధానాలను నిర్దేశిస్తుంది. న్యాయాధికారుల నియామకం, బదిలీ, పదోన్నతి, క్రమశిక్షణ మొదలగు సర్వీసు విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును సంప్రదించాలి.

### దిగువ కోర్టులు :

హైకోర్టు తర్వాత వచ్చే దిగువ కోర్టులను ‘‘సబార్డినేట్ కోర్టు’’లంటారు. ప్రకరణలు 233 నుంచి 237 వరకు వీటి గురించి ప్రస్తావించారు. వీటిలో జిల్లా కోర్టులు, సిటి సివిల్ కోర్టులు, మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులుంటాయి.

SAKSHI

SAKSHI